# ఆమెకు అండగా.. ఆరోగ్యం నిండుగా



- మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- 'ఆరోగ్య మహిళ' కేంద్రాల్లో మహిళా వైద్యులతో పరీక్షలు
- క్యాన్సర్, విటమిన్ బీ12 పరీక్షలు సైతం..
- జిల్లాలో ఐదు కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సేవలు
- మార్చి నుంచి ఇప్పటివరకు 8,475 మందికి పరీక్షలు
- సమస్య ఉన్న 318మంది పెద్దాసుపత్రికి రిఫర్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ) : యుక్తవయస్సు నుంచి పెద్దవాళ్లదాకా ఆడవాళ్లను ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. వాటన్నింటి పరిష్కారం కోసం ఆమెకు అండగా సర్కారు ఆసుపత్రిలో ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో 'ఆరోగ్య మహిళ' పేరుతో ప్రతి మంగళవారం కేవలం మహిళలకు వైద్యసేవలు అందిస్తున్నారు. యుక్తవయస్సు నుంచి 60 ఏండ్ల మధ్య ఉన్న మహిళల కోసం సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ఈ ప్రత్యేక వైద్యసేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రతి మంగళవారం దూరప్రాంతాల నుంచి 'ఆరోగ్య మహిళ' కేంద్రాలకు వచ్చి పలురకాల వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలో పెనగడప, పినపాక పరిధిలో ఎంపీ బంజర, ఇల్లెందు పరిధిలో కొమరారం, భద్రాచలం పరిధిలో పర్ణశాల, అశ్వారావుపేట పరిధిలో ఎర్రగుంట పీహెచ్‌సీల్లో 'ఆరోగ్య మహిళ' కేంద్రాలను ఏర్పాటు చేశారు.



ఆరోగ్య సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

### క్యాన్సర్ నిర్ధారణ కోసం రేడియాలజీ హబ్

అన్ని జబ్బులు ఒక ఎత్తైయితే క్యాన్సర్ పేరు చెబితేనే మనిషి సగం అయ్యే పరిస్థితి. అలాంటి పెద్ద జబ్బులకు కూడా సర్కారు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ ఆరోగ్య మహిళ కేంద్రాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేస్తున్నారు. క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు మామోగ్రామ్ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం కొత్తగూడెం జిల్లాకేంద్రంలో రేడియాలజీ హబ్‌లో ఈ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు. ఇప్పటికే చాలామంది అనుమానితులను గుర్తించి మామోగ్రామ్ చేయించారు. కానీ ఇంతవరకు ఎవరికీ లక్షణాలు తేలలేదు. భవిష్యత్‌లో ఎవరికి వచ్చినా ముందస్తుగా తెలుసుకుని మందులు వాడితే ఎంతపెద్ద జబ్బైనా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా మహిళలకు వచ్చే ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్‌ను గుర్తిస్తారు.

**ఇప్పటివరకు పరీక్షలు చేయించుకున్న వారు**

| పీహెచ్‌సీ | పరీక్షలు చేసినవి | రిఫర్ చేసిన కేసులు |
|---|---|---|
| మోరంపల్లి బంజర | 1,411 | 59 |
| పర్ణశాల | 1,672 | 33 |
| ఎర్రగుంట | 1,833 | 96 |
| పెనగడప | 1,898 | 101 |
| కొమరారం | 1,661 | 29 |

### ప్రతి మంగళవారం ప్రత్యేక పరీక్షలు

ముఖ్యంగా మహిళలకు సంబంధించిన వ్యాధులకు ప్రత్యేక పరీక్షలు చేసేందుకు ప్రతి మంగళవారం స్క్రీనింగ్ చేస్తున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్, గుండె, రుతు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేస్తున్నారు. దీంతోపాటు కొత్తగా విటమిన్ బీ–12, విటమిన్– డీ పరీక్షలు కూడా చేస్తున్నారు. ముఖ్యంగా యుక్త వయస్సు బాలికలు వారి సమస్యలను చెప్పుకోకపోవడం వల్ల పెళ్లి అయిన తర్వాత పిల్లలు పుట్టకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అటువంటి వారికి ఆరోగ్య మహిళ కేంద్రాల్లో సేవలు చాలా ఉపయోగపడుతున్నాయి. ఇందుకోసం వైద్యులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. అందులో పనిచేసే నర్సులకు కూడా ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. నెలకొకసారి అందరికి పరీక్షలపై అవగాహన కూడా కల్పిస్తున్నారు.

### అనారోగ్య సమస్య ఏదైనా చెప్పుకోవచ్చు



మగవాళ్లు ఉన్న ఆసుపత్రికి వెళ్లాలంటే అందరు వెళ్లలేరు. ప్రభుత్వం మంచి పని చేసింది. ఆడోళ్లకి మాత్రమే మంగళవారం పెట్టారు. అనారోగ్య సమస్య చెప్పుకుంటే వచ్చిన జబ్బు వెంటనే తగ్గే అవకాశం ఉంటది. అన్ని పరీక్షలు చేస్తున్నారు. పెద్ద జబ్బుకు కూడా పరీక్షలు ఉన్నాయి. ఎలాంటి ఇబ్బంది లేదు. డాక్టరమ్మ బాగా చూస్తున్నది. పిల్లలను కూడా తీసుకొస్తున్నాం.

**– రాంబాయి, చంద్రుగుంట, చుంచుపల్లి మండలం**

### 8,475 మందికి పరీక్షలు చేశాం..



మార్చి 8వ తేదీన ఆరోగ్య మహిళ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అప్పటినుంచి ఇప్పటి వరకు 8,475 మందికి పరీక్షలు చేశాము. ఇందులో 318 మందిని పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేశాం. జిల్లాకేంద్రంలో రేడియాలజీ హబ్ ప్రారంభించాం. మామోగ్రామ్, సిటీ స్కాన్, టుడీ ఏకో కూడా ఉంది. జిల్లాలోని ఐదు పీహెచ్‌సీల్లోనూ ప్రతి మంగళవారం వందకు తగ్గకుండా రోగులు వస్తున్నారు.

**– డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం**

### మాకు ఒక ఆసుపత్రి వచ్చింది



అప్పుడు ఆసుపత్రికి వెళ్లాలంటే ప్రైవేటుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆడవాళ్ల కోసం ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. సౌకర్యాలు బాగా ఉన్నాయి. అన్ని పరీక్షలు ఇక్కడే చేస్తున్నారు. లేడీ డాక్టర్ ఉన్నారు. ఎలాంటి భయం లేదు. సమస్యను మంచిగా చెప్పుకునే అవకాశం ఉంది. కుటుంబంలో ఉన్న ఆడవాళ్లమంతా ఎలాంటి సమస్య ఉన్నా పరీక్షలు చేపించుకుంటున్నాము. ఖరీదైన మందులు కూడా ఉన్నాయి. పరీక్షలు ఉండడం వల్ల ఎలాంటి జబ్బయినా ముందే తెలుసుకోవచ్చు.

**– లావణ్య, గౌతంపూర్, చుంచుపల్లి మండలం**

### వారంలో వందమంది వస్తున్నారు



ప్రతి రోజూ ఇతరులను కూడా చూస్తాము. మంగళవారం మాత్రం కేవలం ఆడవాళ్లకి పరీక్షలు చేస్తున్నాం. 18 నుంచి 60 సంవత్సరాల వాళ్లందరూ వస్తున్నారు. వారికి ఆరోగ్య మహిళ కార్డును ఇస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. క్యాన్సర్ అని అనుమానం వస్తే పరీక్షకు పంపిస్తున్నాము. ఇంతవరకు పెనగడపలో అలాంటి కేసులు రాలేదు. చాలామందిలో పిరియడ్స్, పిల్లలు పుట్టకపోవడం వంటి సమస్యలను గుర్తించాం.

**– నేహా అమీన్, వైద్యురాలు, పెనగడప పీహెచ్‌సీ**



చర్ల: ముంపుగ్రామాల్లో కలెక్టర్ ప్రియాంక ఆల



ఆళ్లపల్లి: మోస్తరుగా ప్రవహిస్తున్న జల్లేరు,కోడెల వాగులు



సత్తుపల్లి రూరల్: మత్తడి పోస్తున్న కాకర్లపల్లి ఊరచెరువు

# జలదరింపు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు
- జలాశయాలు, ప్రాజెక్టులకు జలకళ
- భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు
- ఏజెన్సీలో పొంగి ప్రవహిస్తున్న వాగులు
- భద్రాద్రి జిల్లా ముంపు ప్రాంతంలో కలెక్టర్ ప్రియాంక ఆల పర్యటన
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపు





అన్నపురెడ్డిపల్లి: మత్తడి పోస్తున్న నర్సపాలెం చెరువు



దుమ్ముగూడెం వద్ద గోదావరి ప్రవాహం



రుద్రంపూర్ ఓసీలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

దుమ్ముగూడెం మండలం చినగుబ్బలమంగి ప్రాజెక్టులో అలుగు పడి పొంగిప్రవహిస్తున్న వరదనీరు

ఖమ్మం, జూలై 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/భద్రాద్రి కొత్తగూడెం (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 24.9 మి.మీ నమోదు కాగా అత్యధికంగా కూసుమంచి మండలంలో 34.8 మి.మీ నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సగటున 51.5 మి.మీ వర్షపాతం నమోదు కాగా దుమ్ముగూడెం మండలంలో 165 మి.మీ నమోదైంది. భారీ వర్షానికి భద్రాద్రి జిల్లా చర్ల మండల పరిధిలోని తాలిపేరు రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 74 మీటర్లు కాగా ప్రస్తుతం నీటి మట్టం 71.24 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 21 గేట్లను ఎత్తి 60 వేల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రాత్రి 10 గంటల వరకు 35.20 అడుగులకు చేరింది. అలాగే వానల ధాటికి సింగరేణి ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్ట్‌ల్లోకి వరద చేరింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. అధికారులు భారీ మోటర్లు పెట్టి వరద నీటిని బయటకు తోడిస్తున్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి, కిష్టారం ఓసీల పరిధిలో 38 వేల టన్నులు, ఇదే ఏరియాలోని ఇతర ఓసీల్లో 30 వేల టన్నులు, మణుగూరులో ఏరియాలోని ఓసీల పరిధిలో 18 వేల టన్నులు, ఇల్లెందు ఏరియా పరిధిలోని ఓసీలో 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. ఖమ్మం జిల్లా పరిధిలోని వైరా రిజర్వాయర్ భారీగా వరద నీరు చేరింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 14.9 అడుగులకు చేరుకున్నది. నిన్నమొన్నటి వరకు వానలు లేక వెనుకబడిన సాగు ఇక నుంచి ఉభయ జిల్లాల్లో ఊపందుకోనున్నది. ఇప్పటికే మొలక దశలో ఉన్న పత్తి పంటకు వర్షం ప్రాణం పోసినట్లయింది. అలాగే పెసర, కంది, పెసర పంటలూ ఊపిరిపోసుకోనున్నాయి. వరి నారు పోసిన రైతులు ఇక నాట్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో రైతులు అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం నియోజకవర్గంలో కలెక్టర్ ప్రియాంక ఆల పర్యటించారు. స్వయంగా గ్రామాల్లో పర్యటించారు. గోదావరి ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. కలెక్టర్ వరద పరిస్థితుల సహాయార్థం కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.







పర్ణశాల: నీటమునిగిన నార చీరెలు ప్రాంతం



దుమ్ముగూడెం మండలం నల్లబెల్లి గ్రామం వద్ద విరిగిపడిన భారీ వృక్షం



దుమ్ముగూడెం : మత్తడి పారుతున్న గంగోలు చెరువు



ఖమ్మం నగరం మున్నేటిలో చేపలు పడుతున్న దృశ్యం



సత్తుపల్లి రూరల్: పొలాల్లోకి చేరిన వరదనీరు

# మడి తడవని మాటలొద్దు..

## రేవంత్ 'కరెంటు' వ్యాఖ్యలపై రైతుల ఆగ్రహం

## ఇలా మాట్లాడితే ఎమ్మెల్యేగా కూడా గెలవలేరు..

## ఉచిత కరెంటుపై కష్టపడే రైతులకు తెలుస్తది

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి అందించే మూడు గంటల విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రైతులు కన్నెర్ర జేశారు. కష్టపడిన రైతులకే కరెంటు విలువ తెలుస్తుందని, మూడు గంటల విద్యుత్‌కు మడి కూడా తడవదని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం రాఘవాపురం రైతు వేదిక వద్ద బుధవారం పలువురు రైతులు రేవంత్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం గురించి తెలియనోళ్లు కరెంటు గురించి మాట్లాడితే రైతుల చేత దెబ్బలు తినడం ఖాయమన్నారు. రైతుల ఉచిత కరెంటు గురించి మాట్లాడే ముందు ఆలోచించుకోవాలని హితవు పలికారు. ఉచిత కరెంటు పేరుతో మళ్లీ జనంలోకి వస్తే సీఎం కాదు కదా.. ఎమ్మెల్యేగా కూడా గెలవలేవని హెచ్చరించారు.

### మాయల పకీర్ రేవంత్



మాయల పకీర్‌లా పూటకో మాట మాట్లాడి రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తే రైతులు ఊరుకోరు. నీ మాటలు నీ ఇంట్లో వాళ్లకి చెప్పు. నోరు అదుపులో పెట్టుకో.. లేకపోతే తాటతీస్తాం. 24 గంటలు కరెంటు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ఎక్కడ చూస్తున్నావ్. నీకు దమ్ముంటే 24 గంటల్లో మూడు గంటలు పోను మిగతా సమయంలో కరెంటు తీగలు పట్టుకుని చూడు తెలుస్తది.

**– లావుడ్యా సత్యనారాయణ, రైతు, సీతంపేట, సుజాతనగర్ మండలం**


### నేను కాంగ్రెస్ నుంచి వచ్చినోడినే..



నేను కాంగ్రెస్ నుంచి వచ్చినోడినే. కరెంటు గురించి ఎన్ని కష్టాలు పడ్డామో మాకు తెలియదా. మోటరు తిరగడానికి స్విచ్ ఆన్ చేస్తే చనిపోయిన రోజులున్నాయి. తెల్లవారే వరకు కాపలా కాసి నిద్రమత్తులో కరెంటు ఆన్ చేసి చనిపోయారు. ఇప్పుడు 24 గంటలు కరెంటు ఉండడం వల్ల ప్రతీ రైతు మంచిగా వ్యవసాయం చేసుకుంటున్నాడు. పంటలు పండించుకుంటున్నాడు. మాకు 24 గంటలు కరెంటు ఇచ్చే కేసీఆర్‌నే మళ్లీ సీఎం కావాలి.

**– గుగులోత్ మంగ్యా, రైతు, రూప్లాతండా, సుజాతనగర్ మండలం**

### రైతుల జోలికొస్తే ఊరుకోం..



వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఉంటేనే రెండు పంటలు వేసుకుంటున్నాం. మూడు గంటల కరెంటుకు మడి కూడా తడవదు. మూడు గంటల కరెంటుతో భూస్వాములకు తప్ప ఎవడికి ఉపయోగం ఉండదు. డబ్బున్నోడికి పేద రైతుల సమస్యలు ఏడ తెలుస్తయి. రైతుల జోలికొస్తే నిక్కరు ఊడబీకుతాం జాగ్రత్త. నోరు అదుపులో పెట్టుకో రేవంత్‌రెడ్డి.

**– బైరి సాంబయ్య, రైతు, శింగభూపాలెం, సుజాతనగర్ మండలం**

### పాత రోజులు మళ్లీ వద్దు



రేవంత్‌రెడ్డి అన్న మాటలతో గత కాంగ్రెస్ పాలనలో పడిన కరెంటు కష్టాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు కరెంటు సరిగా రాక చాలా ఇబ్బందులుపడ్డా. లో వోల్టేజీతో మోటార్లు కాలిపోయి బాగు చేయించడానికి అప్పులు చేశాం. అప్పటి కష్టాలను చెప్పుకున్నా తీర్చేవారు లేరు. అప్పటి రోజులు మళ్లీ వద్దు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తొమ్మిదేళ్ల నుంచి వ్యవసాయానికి కరెంటు మంచిగా ఇస్తున్నారు. మాకు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి.

**– అజ్మీరా గలక, రైతు, బిల్లుడుతండా, టేకులపల్లి మండలం**

116వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
बैंक ऑफ़ बड़ौदा
Bank of Baroda
विजया VIJAYA | DENA
మా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మా కస్టమర్లకు, సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు 116వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలతో...

బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్
బ్యాంక్ ఆఫ్ బరోడా
కొత్తగూడెం బ్రాంచ్
నియర్ గణేష్ టెంపుల్, కొత్తగూడెం